సాక్షి
జగిత్యాల
శనివారం । 11 । మార్చి । 2023



ఆలయాల సందర్శన

కోరుట్లరూరల్: యూసుఫ్‌నగర్, ఐలాపూర్‌లోని ఆలయాలను టీటీడీ అధికారులు శుక్రవారం సందర్శించారు.



మొక్కలకు నీళ్లు పట్టాలి

ఇబ్రహీంపట్నం : గ్రామాల్లోని మొక్కలు ఎండిపోకుండా తరచూ నీళ్లు పట్టి కాపాడాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

ఎనిమిది నెలల్లో ఇందిరమ్మ రాజ్యం





జగిత్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. వేదికపై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు తదితరులు, హాజరైన ప్రజలు

- రైతులకు రుణమాఫీ.. పేదలకు రూ.500కే వంటగ్యాస్
- బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే.. పంపకాల్లోనే లొల్లి
- కవితకు ఈడీ నోటీసులిస్తే తెలంగాణకేం సంబంధం?
- పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజం





జలపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రేవంతర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర

జగిత్యాల/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: 'మరో ఎనిమిది నెలల్లో ఇందిరమ్మ రాజ్యం వస్తుంది.. జగిత్యాల గడ్డపై చెబుతున్న.. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోయారు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తాం.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తాం.. పేదలకు రూ.500కే వంటగ్యాస్ అందించేలా చూస్తాం' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభయం ఇచ్చారు. హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో తన ఇద్దరు కూతుళ్లతో ఆత్మహత్య చేసుకున్న గడ్డం జలపతిరెడ్డి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. రూ.లక్ష సాయం చేశారు. ఆ తర్వాత చల్‌గల్ గ్రామంలో పాదయాత్ర ప్రారంభించారు. వివిధ గ్రామాలతోపాటు జిల్లాకేంద్రంలోని పలు ప్రధాన వీధుల గుండా పాదయాత్ర ద్వారా కొత్తబస్టాండ్ చౌరస్తాకు చేరుకున్నారు. ఇరకరడ జరిగిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గల్లీలో అయ్య లిక్కర్ దందా చేస్తే.. కూతురు ఢిల్లీలో లిక్కర్ దందా చేస్తోందని ఆరోపించారు. కవితకు ఈడీ నోటీసులు జారీ చేస్తే తెలంగాణకేం సంబంధమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని, 370 ఆర్టికల్, రాష్ట్రపతి ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు ఇచ్చిన కేసీఆర్.. ఇప్పుడు పంపకాల లొల్లి రావడంతో మొత్తుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఇది కేసీఆర్ పెంచుకున్న పామేనని, అదే ఇప్పుడు కరుస్తోందని అన్నారు.

జగిత్యాల అంటే జీవన్..

'జగిత్యాల అంటేనే జీవన్.. జీవన్ అంటేనే జగిత్యాల.. ఆయన ఇంటి పేరు కూడా ఎవరికీ తెలియదు.. చెక్కకుర్చీ నుంచే సేవలు అందిస్తారు..' అని రేవంత్‌రెడ్డి కితాబిచ్చారు. మత్స్యకారులు, రజకులు, మంగలి.. తదితర కులవృత్తులు సమస్యల పరిష్కారం కోసం ఏకతాటిగా వస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో కులవృత్తులు విధ్వంసమయ్యాయని అన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ 2022–23లో ఎంతమందికి దళిత బంధు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరునెలల్లో చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తామని, పసుపు పంటకు క్వింటాలుకు రూ.15వేల మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, నిరంతరం ప్రజల కోసం తపనపడే నాయకుడు, పోరాట యోధుడు జీవన్‌రెడ్డి అన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణను లిక్కర్‌మయం చేశారని, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ క్వీన్‌గా మారారన్నారు. పాదయాత్ర ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు బండ శంకర్, విజయలక్ష్మి, మధు, నందన్న, రాజేందర్, దేవేందర్‌రెడ్డి, గంగారెడ్డి, మొగిలి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ ఎక్కడ?

షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను మభ్యమపెట్టి గెలిచిన కల్వకుంట్ల కవిత.. మాట తప్పడంతో మరోసారి ఎన్నికల్లో ఆమెను బొందపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుత ఎంపీ బాండ్‌పేపర్ రాసిచ్చినా షుగర్ ఫ్యాక్టరీ తెరవలేదని, పసుపు బోర్డు తేలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 3 వేల వైన్స్‌లు, 60 వేల బెల్టుషాపులే వెలిచాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సత్యం, ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఉసురు తగులుతుంది

సాక్షి, పెద్దపల్లి/ఎలిగేడు: 'సీఎం కేసీఆర్‌కు పేదల ఉసురు తగులుతుంది.. ధరణి లోపాలను సరిచేసి ఆదుకోవాలి.. ఈ గ్రామసభతోనైనా కళ్లు తెరవాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. 'సుల్తానాపూర్ గ్రామానికి ఓట్లు అడిగేందుకు రాలేదు.. ధరణి పోర్టల్‌తో బాధపడుతున్న మీ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా' అని పేర్కొన్నారు. 'మీ సమస్యలు నమోదు చేసుకొని, కాంగ్రెస్ తరఫున గ్యారెంటీ కార్డులు అందించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పరి ష్కరిస్తామని చెప్పడానికి వచ్చా' అని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారి ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలో మీభూమి– మీహక్కు నినాదంతో 'ధరణి అదాలత్' గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, తెలంగాణ వ్యవహారాల చైర్మన్ మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, కొప్పుల రాజు, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బా బు, పొన్నం ప్రభాకర్, విజయరమణారావు, సిరిసిల్ల రాజయ్య, మహేశ్‌కుమార్‌గౌడ్, నీలిమా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ధరణి బాధితులతో మాట్లాడి వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు.

ఆన్‌లైన్ చేయడం లేదు



తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న. నా ఆట పాటలతో సభలు, సమావేశాలతో ప్రజలను చైతన్యపరిచిన. నాకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని పట్టా చేయడం లేదు. 2009లో అప్పటి ప్రభుత్వం 10 గుంటలు ఇచ్చి, పాసుపుస్తకం అందజేసింది. ధరణిలో నా పేరుమీద చూపించడంలేదు.

– పల్లె రాజేశం, తెలంగాణ ఉద్యమ కళాకారుడు

ఆప్షన్ లేదంటున్నారు



14 ఏళ్ల క్రితం ఇతరుల వద్ద ఎకరం భూమి కొన్నాం. పట్టా చేసి పాస్‌బుక్ తీసుకున్నాం. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత 30గుంటలే చూపిస్తుంది. 10గుంటలు ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. సరి చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగిన ఆప్షన్ రాలేదంటున్నారు. 10గుంటల భూమిని ఆన్‌లైన్‌లో సరిచేయాలి.

– అప్పాల సాగర్, రైతు

పాసుపుస్తకం ఇవ్వాలి



2009లో కాంగ్రెస్ ప్రభుత్వం 20 గుంటల లావోణి పట్టా ఇచ్చింది. ఇప్పుడున్న ప్రభుత్వం ధరణి పోర్టల్ తేవడంతో ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదు. కొత్త పాస్‌బుక్కులు ఇవ్వడంలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన మా భూమికి పట్టాలు ఇవ్వాలి.

– గౌరు శైలజ, మహిళ రైతు

సాదాబైనామాతో కొన్న



గ్రామంలో 20 గుంటలను సాదాబైనామా కింద కొనుగోలు చేశా. గతంలో దానిని ఆర్‌ఓఆర్ కింద పట్టా చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చేది. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు తప్పడంలేదు. 20గుంటలు మోకాపై చూసి పట్టా చేసేందుకు అవకాశం ఇవ్వాలి.

– గోష్కి రాయలింగు, రైతు

మూడెకరాలు సాగులో ఉన్నాం.. పట్టాలివ్వాలి



2009లో తమ కుటుంబసభ్యుల పేరుమీద మూడెకరాలు ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి పహనీలో, కబ్జా కాలంలో ఉన్నప్పటికీ ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఆ కాలమ్ తీసేశారు. పూర్తిస్థాయిలో భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయాలి. ప్రభుత్వం చొరవ చూపితేనే మాకు న్యాయం జరుగుతుంది.

– ముద్రవేణి సంపత్, రైతు

న్యూస్‌రీల్

ప్రతిష్ఠాత్మకంగా కంటివెలుగు



కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు ప్రతీవ్యక్తికి కంటిపరీక్షలు చేసి లోపాలు గుర్తిస్తున్నారని, అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తున్నారని తెలిపారు. కళ్లను నిర్లక్ష్యం చేయకూడదని, కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, డీఎస్పీలు ప్రకాశ్, రవీంద్రకుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సీఐలు రాజశేఖర్‌రాజు, మల్లయ్య, సరిలాల్, ఆర్‌ఐలు వామనమూర్తి, నవీన్ తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి-2 ఎస్సైగా రామకృష్ణ

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీసీఆర్బీ ఎస్సైగా పనిచేస్తున్న రామకృష్ణను ధర్మపురి-2 ఎస్సైగా బదిలీ చేస్తూ ఎస్పీ భాస్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రామకృష్ణ ధర్మపురి-2 ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయనను అక్కడే నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

ఎస్సైలకు పోస్టింగ్

జగిత్యాలక్రైం: దీర్ఘకాలిక సెలవులు పూర్తిచేసుకుని వచ్చిన ముగ్గురు ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. సెలవులపై వెళ్లిన ఎస్సైలు వారం క్రితం ఎస్పీకి రిపోర్ట్ చేశారు. ఇందులో ఐటీకోర్‌కు గుడికందుల సందీప్, డీసీఆర్బీకి గౌతమ్ పవార్, ఎస్బీకి శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

విద్యార్థుల 'జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్'



రికార్డు సాధించిన విద్యార్థులు

కోరుట్ల: స్థానిక అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు ఒకటో తరగతి విద్యార్థులు ప్రపంచ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు భారత ప్రతినిధి బింగి నరేందర్, తెలంగాణ కో ఆర్డినేటర్ వేణుకుమార్ సమక్షంలో శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్ వర్షిక, ఎం.మధుఅశ్విని.. కళ్లకు గంతలు కట్టుకుని 55 సెకండ్లలో 30 జమా, తీసివేత లెక్కల సమస్యలు పరిష్కరించారు. దీంతో ఈ ఇద్దరు వరల్డ్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించి సర్టిఫికెట్లు అందజేశారు. అబాకస్ శిక్షకుడు, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, సాబీర్ అలీ, జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశ్, విద్యా కమిటీ చైర్మన్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు



దీక్ష చేపట్టిన నేతలతో భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: ఢిల్లీలో కాదు.. మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల ఎదుట దీక్ష చేయాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమీపంలో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా చేపట్టిన రైతుదీక్షలో భోగ శ్రావణి మాట్లాడారు. కామాంధుడైన ఓ ఎమ్మెల్యేకు బలైన మహిళా సర్పంచ్ గగ్గోలు పెడుతున్నా ఎవరూ స్పందించకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణలో మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కరువైందని భోగ శ్రావణి ఆవేదన చెందారు. ప్రధానంగా బీఆర్‌ఎస్‌లో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు అఘాయిత్యాలకు బలవుతున్నారని పేర్కొన్నారు. అయినా, ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ముందు తెలంగాణలో మహిళలకు రక్షణ కల్పించాక ఢిల్లీలో దీక్ష చేయాలని సూచించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, నాయకులు నలువాల తిరుపతి, రాగిల్ల సత్యనారాయణ, ముద్దం రాము, రైతులు పాల్గొన్నారు.



వైభవంగా నృసింహుని ఉత్తర దిగ్యాత్ర

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి శుక్రవారం ఉత్తర దిగ్యాత్రకు బయలుదేరి వెళ్లారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఇదే ముఖ్యఘట్టం. ఈసందర్భంగా దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఉసిరికవాగు వద్దకు స్వామివారిని అశ్వవాహనంపై శోభయాత్రగా తీసుకెళ్లి అక్కడి వేదికపై ఆశీనులను చేశారు.

కోరుట్లలో నేహాశెట్టి సందడి

- కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభం



కస్టమర్లకు అభివాదం చేస్తున్న నేహాశెట్టి

కోరుట్ల: పట్టణ నడిబొడ్డున ఏర్పాటుచేసిన కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను సినీనటి నేహాశెట్టి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం షాపింగ్ మాల్ యజమాని ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. వినియోగదారుల కేరింతల నడుమ నేహాశెట్టి 'డీజే టిల్లు' సినిమా పాటలకు స్టెప్పులు వేసి సందడి చేశారు. ఆమెను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

– 8లో..

ఆర్థిక లక్ష్యాలు అధిగమించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలఅగ్రికల్చర్: బ్యాంకులు ఆర్థిక లక్ష్యాలు అధిగమించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంకర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, సర్టిఫికెట్ల పేరిట తిప్పించుకుంటే బ్యాంకులపై నమ్మకం పోతుందని, తద్వారా ప్రజలు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తారని హెచ్చరించారు. డిపాజిట్ల సేకరణ లక్ష్యమే కాకుండా, సమాజ సేవలోనూ ముందుకు రావాలని కోరారు. ఇప్పటివరకు రూ.1,176 కోట్ల వ్యవసాయ, రూ.732కోట్ల దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు మంజూరు చేశారని తెలిపారు. 4,710 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించారని, స్వశక్తి సంఘాలకు రూ.413.5 కోట్ల రుణాలు మంజూరు చేశారని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులు తమ వ్యాపారాభివృద్ధికి తప్ప జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డెయిరీ, ఫిషరీష్, స్టాండప్ ఇండియా స్కీం, పశు సంవర్ధక శాఖ పథకాలకు అదనంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఐ ఎల్‌డీవో అనిల్‌కుమార్, నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ వంశీకృష్ణ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఫణి శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రోజూ 200మందికి కంటి పరీక్షలు

జగిత్యాల: కంటి వెలుగు కార్యక్రమంలో రోజూ 200 మందికి నేత్రపరీక్షలు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. స్థానిక 22వ వార్డులో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు 2.60 లక్షల మందికి పరీక్షలు చేశామని, 39,500 రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశామని తెలిపారు. త్వరలోనే అందరికీ పాయింట్ కళ్లద్దాలు అందజేస్తామని అన్నారు.



వేములవాడ రాజన్న సన్నిధిలో పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణోత్సవం, రాజన్న కల్యాణంలో పాల్గొన్న శివపార్వతులు, భక్తులు

కల్యాణ వైభోగమే..

- అంగరంగ వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- ఉప్పొంగిన భక్తజన హృదయాలు
- రాజన్నను పెళ్లాడిన శివపార్వతులు
- లక్ష మందికి పైగా తరలివచ్చిన భక్తులు
- పనిచేయని ఎల్‌ఈడీలు.. ఎండలో ఇబ్బందిపడ్డ భక్తులు
- రేపు రథోత్సవం

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య వివాహ వేడుకను అర్చకులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చేతిలో త్రిశూలం, బాసింగాలతో శివపార్వతులు రాజన్నను కల్యాణం చేసుకోగా.. వేలాది మంది తరలివచ్చిన హిజ్రాలు తలంబ్రాలు పోసుకుంటూ సందడి చేశారు. కల్యాణోత్సవంలో భాగంగా మున్సిపల్ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు స్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు దాదాపు రెండున్నర గంటల పాటు కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ వేదిక ఆలయ ఆవరణలో వేయడంతో వేలాది మంది భక్తులు ఆరుబయట ఎండలోనే ఉన్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్స్ పనిచేయలేదు. ఎండతీవ్రంగా ఉండడం.. కనీసం టెంట్లు కూడా వేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కన్యాదాతలుగా గోపన్నగారి వసంత్– సరిత దంపతులు, వ్యాఖ్యాతలుగా తిగుళ్ల శ్రీహరిశర్మ, చంద్రగిరి శరత్ వ్యవహరించారు. భక్తుల ద్వారా రూ.80 వేల కట్నాలు స్వామివారికి వచ్చినట్లు పీఆర్‌వో చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, కౌన్సిలర్లు, పట్టణంలోని ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రథోత్సవం

శివ కల్యాణోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకాలు, పారాయణాలు, బలిహరణం, సాయంత్రం శివ పురాణ ప్రవచనాలు నిర్వహిస్తారు. ఆదివారం మధ్యాహ్నం 3.05 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఇటుక బట్టీల పరిశీలన


కార్మికులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

మల్యాల: మండలంలోని రాజారాం శివారులో వీఆర్‌కే కళాశాల ఎదురుగా ఉన్న ఇటుక బట్టీలను శుక్రవారం ఆర్డీవో మాధురి పరిశీలించారు. ఇటీవల ఇటుక బట్టీల యజమాని ఒడిశాకు చెందిన కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటుక బట్టీలను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు మనోధైర్యం కల్పించారు. యజమానిపై కేసు నమోదు చేశామని, కఠిన చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఆమెవెంట డీఎస్పీ ప్రకాశ్, లేబర్ ఆఫీసర్ కృష్ణసాగర్, తహసీల్దార్ సుజాత, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

కొండగట్టులో ముగిసిన టెండర్లు


వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంపై శుక్రవారం సప్లయ్ టెండర్లకు సీల్డ్‌వేలం నిర్వహించారు. వీఐపీ వస్త్రాలు శ్రావన్ క్లాత్ స్టోర్ కరీంనగర్, పూలదండలు ఎం.ప్రశాంత్ కరీంనగర్, కూరగాయలు కోలకాని సంజీవ్ డబ్బు తిమయ్యపల్లి, అర్చన టిక్కెట్లు ముద్రణ లక్ష్మీ ప్రింటర్స్ ముల్కనూర్, శానిటేషన్ ఎస్‌ఆర్‌ఆర్ ప్రైజెస్ కరీంనగర్ కొండదిగువ ఉన్న 39 గదులు పంజాల మల్లేశం, కొండగట్టు కొండదిగువ బస్టాండ్ పక్కన ఉన్న దేవాదాయ గదులు 1,2,4,7,9,11,13,14,15 లను 01-04-2023 నుంచి 31-03-2024 ఏడాది కాలంపాటు టెండర్‌దారులు దక్కించుకున్నారు టెండర్ల పర్యవేక్షకులు రవికిషన్ ఈవో వెంకటేశ్ చైర్మన్ మారుతిస్వామి అధికారులు సునీల్ శ్రీనివాస చారి ధర్మేందర్, జమున శ్రీనివాస్ పాల్గొన్నారు .

ఎడ్లబండిలో టేకు కలప..


సిరిసిల్ల రేంజ్ ఆఫీస్‌కు టేకు కలపను తరలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎడ్లబండిని తరలిస్తున్న వ్యక్తులను చూస్తే రైతులనుకుంటాం. కానీ వారు అటవీశాఖ అధికారులు. ఎడ్లబండిలో టేకు కలపను తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో వారు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు వెంకటాపూర్ వద్ద కాపుగాశారు. ఈక్రమంలో వెంకటాపూర్ శివారులో పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని గమనించిన కలప రవాణాదారులు ఎడ్లబండిని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎడ్లబండిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కలప కోసం మళ్లీ వారు వస్తారని భావించి నాలుగు గంటలపాటు అక్కడే వేచి చూశారు. ఎంతకీ రాకపోవడంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. సెక్షన్ ఆఫీసర్ బాపిరాజు, బీట్ ఆఫీసర్ వసుమతి ఎడ్లబండిని సిరిసిల్ల రేంజ్ ఆఫీస్‌కు తరలించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఎడ్లబండితోపాటు అందులో ఉన్న రూ.6,400 విలువ చేసే 12 టేకు దుంగలను సీజ్ చేశారు. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పసుపు ధర పతనం..

- జగిత్యాల మార్కెట్‌యార్డులో క్వింటాల్‌కు రూ.4–5 వేలలోపే..
- గతేడాది నిల్వలతోనే ధర పడిపోయిందంటున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతులు


జగిత్యాల మార్కెట్ యార్డులో పసుపును కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

జగిత్యాల అగ్రికల్చర్ : పసుపును ఔషదాల్లో, రంగుల పరిశ్రమల్లో, ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తుండటంతో వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో, దేశీయంగా, అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంటుంది. అయితే, గడిచిన ఏడాది పసుపు నిల్వలు పేరుకుపోవడం, అంతర్జాతీయంగా ఇతర దేశాలకు ఎగుమతి లేకపోవడంతో పసుపు ధరలు పతనమవుతున్నాయి. ప్రస్తుతం జగిత్యాల మార్కెట్ యార్డులో క్వింటాల్‌కు రూ.4–5 వేలలోపు ధరలు పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పేరుకుపోతున్న గతేడాది నిల్వలు..

గతేడాది దేశవ్యాప్తంగా పసుపు నిల్వలు దాదాపు 30 లక్షల సంచుల వరకు పేరుకుపోయాయి. ప్రస్తుతం కొత్త పసుపు సైతం 2 లక్షల టన్నుల వరకు ఉంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసిన పసుపుతో పాటు కొత్త పసుపు మార్కెట్‌కు వస్తుంది. మన దేశం నుంచి ఇరాన్, జర్మనీ, జపాన్, యుఏఈ, బ్రిటన్, అమెరికా దేశాలకు ఎగుమతి అవుతుండగా ఆయాదేశాలు ఇండియా నుంచి వచ్చే పసుపు ఎగుమతులను రకరకాల కారణాలతో తగ్గించాయి. దీంతో ఇక్కడ కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతర దేశాలకు ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే గతేడాది పసుపు నిల్వచేసిన వ్యాపారులు, ఈ ఏడాది కొనుగోలుకు మొగ్గుచూపడం లేదు. ఒక వేళ కొనుగోలు చేసినా అంతంత మాత్రమే ధరలు ఉండడంతో రైతులకు కలిసి రావడం లేదు.

రూ.1500 వరకు తగ్గిన ధరలు..

జిల్లాలో 40వేల ఎకరాల వరకు పసుపు పంట పండిస్తారు. ఎకరాకు సగటున 15 క్వింటాళ్ల వరకు దిగుబడి అంచనా వేసినా 60 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అయితే ఇక్కడి రైతులు పసుపును ఉడుక బెట్టి, పాలిష్ చేసి జగిత్యాల, మెట్‌పల్లి మార్కెట్లతో పాటు నిజామాబాద్ జిల్లా మార్కెట్‌కు తీసుకెళ్తారు. కాగా క్వింటాల్‌కు రూ. 4–5వేలు మాత్రమే ఉండగా గతేడాది క్వింటాల్‌కు రూ.5 నుంచి 7 వేల వరకు ధర పలికింది. గతేడాతో పోల్చితే క్వింటాల్‌కు రూ.1000 నుంచి 1500 వరకు ధర తగ్గింది. దీంతో ఎకరం ఉన్న రైతు రూ.15–20 వేల వరకు రైతులు నష్టపోతున్నారు.

మహారాష్ట్రలో విస్తీర్ణం పెరగడంతోనే..

తెలంగాణతో పోల్చితే మహారాష్ట్రలో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్రలోనే గతేడాది లక్ష టన్నుల వరకు నిల్వలు ఉన్నట్లు, ఆ పసుపు అంతా మార్కెట్లకు తీసుకురావడంతో ధరలు తగ్గుతున్నాయి. దేశీయ అవసరాలకు మించి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒరిస్సాలో పసుపు సాగు పెరుగుతుండటంతో డిమాండ్ తగ్గుతుందని వ్యాపారులు చెపుతున్నారు.

రోజుల తరబడి మార్కెట్‌లోనే

ఓ వైపు ధర లేదని రైతులు ఆందోళన చెందుతుంటే, మరో వైపు కొనుగోలు చేసిన పసుపును ఎక్కడికి పంపించినా తక్కువ రేటుకు అడుగుతున్నారంటూ వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పసుపును రోజుల తరబడి మార్కెట్‌యార్డులోనే ఉంచాల్సిన పరిస్థితి నెలకొందని, రైతులకు డబ్బులు చెల్లించడం కూడా కష్టమవుతుందని చెబుతున్నారు. కాగా సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఖర్చులకు కూడా సరిపోవు..



నేను తీసుకెళ్లిన పసుపు (కాడి)కి క్వింటాల్‌కు రూ 5,250 ధర పలుకగా, గోలకు క్వింటాల్‌కు రూ 4,400 ధర పలికింది. గత ఏడాది క్వింటాల్‌కు రూ 6–7 వేలు అమ్ముకున్నాను. అసలే ఈ ఏడాది వర్షాలతో సరిగ్గా పంట రాలేదు. పసుపు అమ్ముకుంటే వచ్చే పైసలు ఖర్చులకు కూడా సరిపోయేలా లేవు.

– మోత్కు లింగన్న, వంజరిపల్లి, జగిత్యాల రూరల్ మండలం

గతేడాది నిల్వలు ఎక్కువయ్యాయి.



గతేడాది పసుపు నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. పాత పసుపుతో పాటు కొత్త పసుపు వస్తుండటంతో ధరలు పతనమయ్యాయి. మేము కొనుగోలు చేసిన పసుపును తీసుకోవాలని ఇతర రాష్ట్రాల వ్యాపారులను కోరితే స్పందన లేదు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పసుపు యార్డులోనే పేరుకుపోతోంది. పసుపు ధరలు ఒక్క మార్కెట్‌తో కాకుండా అంతర్జాతీయంగా ముడిపడి ఉంటాయి. – శీలం వేణు, వ్యాపారి, జగిత్యాల

నాణ్యమైన పసుపు తీసుకురావాలి



వాస్తవంగా పసుపు ధరలు అంతర్జాతీయంగా, దేశీయంగా కొంత తగ్గాయి. అయినప్పటికీ, వ్యాపారులు ఉన్నంతలో మంచి రేటు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులు తేమ ఉన్న పసుపును తీసుకురాకుండా, నాణ్యమైన పసుపు తీసుకురావాలి.

–నక్కల రాధ, మార్కెట్ చైర్ పర్సన్, జగిత్యాల

కూతురు పెళ్లి చేశాక హఠాన్మరణం

- పెళ్లింట్లో విషాదం


బెజ్జారపు లింబాద్రి(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఓవైపు పచ్చని పందిరి.. మరోవైపు కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల సందడి.. అల్లారుముద్దుగా పెంచిన కుమార్తె వివాహం అంగరంగా వైభవంగా జరిగింది.. అప్పగింతలూ పూర్తయ్యాయి.. ఇక తనకంటే గొప్పెవరనుకున్నాడో ఏమోగానీ.. రాత్రివేళ హాయిగా నిద్రపోయాడు.. అంతలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు నవ వధువు తండ్రి బెజ్జారపు లింబాద్రి(55). అప్పటిదాకా ఎంతో సంతోషంగా ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగింది. కొత్తదాంరాజుపల్లిలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బెజ్జారపు లింబాద్రి – పద్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు వైష్ణవి(26), సాయిప్రియ(22). పెద్ద కుమార్తెకు 2015లో వివాహమైంది. చిన్నకుమార్తె సాయిప్రియకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన చరణ్‌తేజ్‌తో గురువారం ఉదయం వివాహం జరిగింది. అప్పగింతలు పూర్తయ్యాయి. కొందరు బంధువులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు, కుటుంబసభ్యులు ఉదయం జరిగిన పెళ్లి కబుర్లు చెప్పుకుని సంతోషించారు. రాత్రివేళ భోజనాలు ముగించుకుని నిద్రపోయారు. అయితే, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లింబాద్రి.. అర్ధరాత్రి దాటాక సుమారు ఒంటిగంట ప్రాంతంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా మృతి చెందారు. అప్పటిదాకా అందరితో ఆనందంగా గడిపిన తండ్రి హఠాత్తుగా మృతి చెందడంతో పెద్దకుమార్తె వైష్ణవి, భార్య పద్మ, కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. లింబాద్రి మృతితో కొత్తదాంరాజుపల్లిలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ బద్దం సరిత, మాజీ ఎంపీపీ బద్దం విజయ పరామర్శించారు.

మహిళ మృతదేహం లభ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారు ఎస్సారెస్పీ కాలువలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మహిళపై ఆకుపచ్చరంగు దుస్తులు, కాళ్లకు వెండి కడియాలు, ఆకుపచ్చ గాజులు ఉన్నాయి. సుమారు 40–50 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా గుర్తిస్తే పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొడిమ్యాల: మండలంలోని గొరాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. అనంతరం వారి నుంచి రూ. 30,460, నాలుగు ద్విచక్రవాహనాలు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం ముద్దనూర్ గ్రామంలోని మనోహర్(5)పై శుక్రవారం వీధికుక్కలు దాడిచేశాయి. ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడిపై అటుగా వచ్చిన వీధికుక్కలు ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. కుటుంబసభ్యులు, స్థానికులు వచ్చి వాటిని తరిమేశారు. అనంతరం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీధికుక్కల బెడద అధికంగా ఉందని పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే ప్రజావాణికి ఫిర్యాదు చేశారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున కూరగాయలతో ఉన్న టీఎస్ 16 యూసీ 2292 నంబర్ గల బొలేరా వాహనం ఎండీ ముక్తార్ అనే వ్యక్తి పెద్దూరు మీదుగా సిరిసిల్ల మార్కెట్‌కు అతివేగంగా వస్తూ, అదుపు తప్పి పలువాహనాలు, చిరువ్యాపారుల గుడిసె ను, సూర రమేశ్ అనే వ్యక్తిని ఢీకొట్టింది. గాయాల పాలైన రమేశ్ ఫిర్యాదు మేరకు ముక్తార్‌పై కేసు నమోదు చేసినట్లుసీఐ అనిల్ కుమార్ తెలిపారు.

మూఢ నమ్మకాలను నమ్మొద్దు

- భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్


అవగాహన కల్పిస్తున్న నరేశ్

మల్లాపూర్ : విద్యార్థులు మూఢ నమ్మకాలను నమ్మొద్దని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 'విద్యా ఆవశ్యకత–మూఢ నమ్మకాల నిర్మూలన' అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దొంగస్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలీమొద్దిన్, ఎస్ఎంసీ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ స్వరూప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలంలోనే పోయిన ప్రాణాలు


ఎర్ర లింగం(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): పంట పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మొట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర లింగం(51)కు గ్రామ శివారులో పొలం ఉంది. ఈ యాసంగిలో వరి సాగుచేశాడు. ఎప్పటిలాగే శుక్రవారం తన పంట పొలం వద్దకు వెళ్లాడు. పంటకు యూరియా చల్లుతూ ముందుకు సాగుతున్నాడు. అయితే, అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగిలింది. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యామ్‌నాయక్ కేసు నమోదు చేసుకున్నారు.

బ్యాండ్ మేళంతో తరలివచ్చిన నాయకులు

జగిత్యాల రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పన్నాల రాంరెడ్డి దర్శకత్వం వహించి నిర్మించిన రూపొందించిన చిత్రం 'నేడే విడుదల'సినిమా శుక్రవారం విడుదల కాగా జగిత్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్‌లో ప్రదర్శించారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, గ్రామస్తులు, రాంరెడ్డి కుటుంబ సభ్యులు బ్యాండ్ మేళంతో ర్యాలీగా వచ్చి సినిమాను వీక్షించారు.

కోరుట్లలో నేహాశెట్టి సందడి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నేహాశెట్టి


పట్టు చీర ప్రదర్శిస్తున్న సినీ నటి నేహాశెట్టి

కోరుట్ల: సినీనటి నేహాశెట్టి, మాల్ యజమాని ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి శుక్రవారం పట్టణంలోని కిసాన్ ఫ్యాషన్ మాల్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. వినియోగదారుల కేరింతల మధ్య వస్త్రాల కౌంటర్లు సందర్శించారు. పట్టు చీరలు నాణ్యంగా, మన్నికగా ఉన్నాయని ప్రశంసించారు. సరికొత్త వెరైటీలతో పట్టు చీరలు, సంప్రదాయ దుస్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్త పెళ్లి కూతుళ్ల కోసం అన్ని వెరైటీలు తక్కువ ధరలకే లభిస్తాయని అన్నారు. అనంతరం షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటు చేసిన స్టేజీపై నేహాశెట్టి.. డీజే టిల్లు పాటపై స్టెప్పులు వేయడంతో జనం జోష్‌తో కేరింతలు కొట్టారు. పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

జై జవాన్..జై 'కిసాన్' లక్ష్యం

యాభై ఏళ్ల క్రితం రైతులకు అవసరమైన మన్నికైన వస్త్రాలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన కిసాన్ ఫ్యాషన్ మాల్ నేడు ఏడు బ్రాంచీలతో అన్నిరకాల వస్త్రాలకు నిలయంగా మారిందని యజమాని ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభించినా ఆ ప్రాంతానికి చెందిన సుమారు 200 మందికి ఉపాధి కల్పించడంతోపాటు అన్నిరాయితీలు కల్పిస్తామని అన్నారు. జిల్లా నడుబొడ్డున కోరుట్ల ఉందని, అందుకే జిల్లావాసులు అందరికీ అందుబాటులో ఉండేలా కిసాన్ ఫ్యాషన్‌మాల్ ప్రారంభించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య–అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, కౌన్సిలర్ ఆడెపు కమల–మధు, కిసాన్ ఫ్యాషన్ మాల్ భవన యజమాని, వ్యాపారవేత్త పడాల నారాయణగౌడ్, షాపింగ్ మాల్ నిర్వాహకులు ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వినయ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం ప్రతినిధులు

జగిత్యాల: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతం పెంచేలా చూడాలని రాష్ట్రస్థాయి పరిశీలన బృందం రిసోర్స్ పర్సన్స్ పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాలతో పాటు గొల్లపల్లి, జగిత్యాల రూరల్‌లోని పలు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల బోధనా విధానం, పాఠ్య పుస్తకాల వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పరిశీలన బృందం ప్రతినిధులు శ్రీలత రావు, వినీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

పెగడపల్లి: పెగడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా పర్యవేక్షక బృందం సభ్యులు పరిశీలించారు. పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పరీక్షా విధానం అమలు, అల్పాహారం పంపిణీ, అభ్యాసక దీపికల వినియోగం తదితర అంశాలపై వారు ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ప్రణాళికతో చదివితే వందశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు. ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధనా తదితర అంశాలను వారు పరిశీలించారు. బృందంలోని సభ్యులు గంగ నర్సయ్య, శేషగిరి శ్రీనివాస్, మహేశ్, హెచ్‌ఎంలు లచ్చయ్య, మధుసూధన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


బొల్లి నర్సయ్య మృతదేహం

వెల్గటూర్ : అప్పులబాధతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన బొల్లి నర్సయ్య అంతకుముందు బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ సరిగా పనులు దొరకకపోవడంతో చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక బాధపడుతుండేవాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటిముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కూతురు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

ఆహార నియమాలు పాటించాలి


వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు

జగిత్యాలటౌన్ : ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలని ఏటీఎం ఆస్పత్రి వైద్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొన్ని శుక్రవారం పట్టణంలోని ఏటీఎం ఆస్పత్రిలో ఉచిత బీపీ, షుగర్, కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 200మందికి పైగా రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఏటీఎం ఆస్పత్రిలో ఇప్పటి వరకు 3600 మందికి ఉచిత ఆపరేషన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కిడ్నీ నిపుణులు డా.సురేశ్ గౌడ్, కల్యాణ్ చక్రవర్తి, డా వేణుగోపాల్, రామచంద్రన్, మంద మల్లేశం, నేరెళ్ల మల్లేశం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం

ఒకరికి గాయాలు


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

సిరిసిల్లఅర్బన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. (టీఎస్ 16 యూసీ 2292) అనే నెంబర్‌గల బొలెరో వాహనం టమాటాల లోడుతో కామారెడ్డి వైపు నుంచి సిరిసిల్లకు వెళ్తోంది. పెద్దూరు బస్టాండ్ వద్దకు రాగానే అదుపుతప్పి అక్కడే ఉన్న మంగళాపు అంజయ్య హోటల్ వద్ద ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో హోటల్ ముందు పార్క్‌చేసిన శివరాత్రి నాగరాజు, బడుగు దేవయ్య, సూర రవికి చెందిన ద్విచక్రవాహనాలు దెబ్బతినగా రవికి స్వల్పగాయాలయ్యాయి. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో గాయపడిన రవిని వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

- హన్మకొండలో ప్రమాదం.. రామకృష్ణకాలనీలో విషాదం



సత్యనారాయణ రెడ్డి మృతదేహం (ఫైల్)

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీకి చెందిన వడాల సత్యనారాయణరెడ్డి హన్మకొండ జిల్లాలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని కరీంనగర్‌కు బైక్‌పై వెళ్తుండగా భీమారం ఎర్రగట్టు గుట్టవద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు హన్మకొండకు వెళ్లి బోరున విలపించారు.

నేత్రాలు సజీవం..

పుట్టెడు దుఃఖంలో ఉన్న సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐబ్యాంక్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఒప్పించి ఆయన నేత్రాలు సేకరించారు. దీంతో కుటుంబ సభ్యులను గ్రామస్తులు, పలువురు అభినందించారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి అంత్యక్రియలు రామకృష్ణ కాలనీలో నిర్వహించగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గతంలో ఆయన ప్రైవేట్ పాఠశాల నడిపించగా పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున హాజరై చిన్ననాటి గురువుకి కన్నీటి వీడ్కోలు పలికి నివాళులు అర్పించారు.